ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం
విశాఖపట్నం కేంద్రం
జాతీయ వార్తలు

తేదీ: 20-12-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

ముఖ్యాంశాలు

- పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి.
- రక్షణ రంగంలో భారతదేశం స్వయం సమృద్ధిని సాధిస్తోందని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- దేశ సరిహద్దులను కాపాడేందుకు సైనికులు చేస్తున్న త్యాగాలు గొప్పవని కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా కొనియాడారు.
- పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగేలా ప్రతిపక్షాలు ఆలోచన చేయాలని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు కోరారు.
- ప్రపంచ వ్యాప్తంగా శ్రేయస్సు, శాంతిని పెంపొందించడమే లక్ష్యంగా మొదటి ప్రపంచ ధ్యాన దినోత్సవం రేపు జరుపుకోనున్నాము.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రక్షణ రంగంలో భారతదేశం స్వయం సమృద్ధిని సాధిస్తోందని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్ లోని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్ మెంట్ (సీడీఎం)లో ఈ రోజు జరిగిన కార్యక్రమంలో రాష్టపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రక్షణ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు మేక్ ఇన్ ఇండియా, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, డిఫెన్స్ ఇండస్ట్రీ కారిడార్ ల అభివృద్ధి వంటి కార్యక్రమాల ద్వారా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. సాంకేతికంగా అధునాతన పరికరాలను భారతదేశంలోనే తయారు చేయడం హర్షణీయమని పేర్కొంటూ...

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. బైట్..(వాయిస్..32 సెకన్లు)

ఈ సందర్భంగా సీడీఎంపై ప్రత్యేక పోస్టల్ కవర్ ను ద్రౌపది ముర్ము విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కూడా పాల్గొన్నారు.

==========================

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. చివరి రోజైన ఈరోజు కూడా ఉభయ సభలలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం లోక్ సభ ప్రారంభం కాగానే, అంబేద్కర్ పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై విపక్ష సభ్యులు నినాదాలు చేశారు. నిబంధనలు కచ్చితంగా పాటించాలని, పార్లమెంటు గేటు వద్ద నిరసన తెలపవద్దని స్పీకర్ ఓం బిర్లా ఎంపీలను కోరారు. సభ్యుల ఆందోళనల మధ్యన ఒక దేశం ఒక ఎన్నికకు సంబంధించిన రెండు బిల్లులను పార్లమెంట్ జాయింట్ కమిటీకి పంపించారు. అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేశారు. రాజ్యసభలో అధికార, ప్రతిపక్షాల మధ్య నినాదాలు, ప్రతి నినాదాలతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజల నమ్మకాన్ని, ఆకాంక్షలను గౌరవించాలని చైర్మన్ జగదీప్ ధన్కర్ ఎంపీలను కోరారు. అనంతరం ఒక దేశం ఒక ఎన్నిక బిల్లుపై పార్లమెంటు సంయుక్త కమిటీకి 12 మంది సభ్యులను నామినేట్ చేసే తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆ తరువాత రాజ్యసభను కూడా నిరవధికంగా వాయిదా వేశారు.

==========================

దేశ సరిహద్దులను కాపాడేందుకు సైనికులు చేస్తున్న త్యాగాలు ఎంతో గొప్పవని కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా కొనియాడారు. పశ్చిమ బెంగాల్ సిలిగురిలోని రాణిదంగాలో జరిగిన సశస్త్ర సీమా బల్, ఎస్ ఎస్ బీ 61వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి హోంమంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వామపక్ష తీవ్రవాదంతో సహా అరాచక శక్తులను నిర్మూలించడానికి తమ ప్రాణాలను సైతం వీర సైనికులు అర్పించారని అమిత్ షా పేర్కొంటూ...

హోం మంత్రి అమిత్ షా.. (వాయిస్..27 సెకన్లు)

కాగా, ఈ కార్యక్రమంలో ఎస్ ఎస్ బి డైరెక్టర్ జనరల్ అమృత్ మోహన్ ప్రసాద్ పాల్గొన్నారు. ఎస్ ఎస్ బి సిబ్బందికి, అమిత్ షా శౌర్య పురస్కారాన్ని అందజేశారు.

==========================

ఒక దేశం ఒక ఎన్నికకు సంబంధించిన రెండు బిల్లులను పార్లమెంట్ జాయింట్ కమిటీకి ఈరోజు పంపించారు. ఈ కమిటీలో లోక్ సభ సభ్యులు 27 మంది, రాజ్యసభ సభ్యులు 12 మంది ఉన్నారు. కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ రాజ్యాంగంలోని (నూట ఇరవై తొమ్మిదో సవరణ) బిల్లు, 2024 కేంద్రపాలిత ప్రాంతాల చట్టాలు (సవరణ) 2024 బిల్లులను పార్లమెంటు సంయుక్త కమిటీకి పంపాలని లోక్ సభలో ఈ రోజు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. వచ్చే పార్లమెంటు సమావేశాల చివరి వారం మొదటి రోజులోగా పార్లమెంటు సంయుక్త కమిటీ తన నివేదికను సభకు సమర్పించనుంది.

==============================

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగేలా ప్రతిపక్షాలు సహా అందరూ ఆలోచన చేయాలని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు కోరారు. ఈరోజు ఉభయ సభలూ వాయిదా పడిన అనంతరం ఆయన పార్లమెంటు వెలుపల పాత్రికేయులతో మాట్లాడుతూ, శీతాకాల సమావేశాలలో ఈసారి తక్కువ పని గంటలే నమోదు అయ్యాయని అన్నారు. లోక్ సభలో 54శాతం, రాజ్యసభలో 40 శాతం ఉత్పాదకతగా ఉందని ఆయన వెల్లడించారు. బడ్జెట్ సమావేశాలు అయినా సాఫీగా జరిగేందుకు ప్రతిపక్షాలు సహకరించాలని కేంద్ర మంత్రి పేర్కొంటూ...

కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు.. బైట్..(వాయిస్..32 సెకన్లు)

==========================

ప్రపంచ వ్యాప్తంగా శ్రేయస్సు, శాంతిని పెంపొందించడమే లక్ష్యంగా మొదటి ప్రపంచ ధ్యాన దినోత్సవం రేపు జరుపుకోనున్నారు. డిసెంబర్ 21వ తేదీన ప్రపంచ ధ్యాన దినోత్సవంగా ప్రకటించాలని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ భారత్ మద్దతుతో చేసిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. ధ్యాన దినోత్సవం ద్వారా శారీరక మానసిక ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. ఒత్తిడి, హింస సామాజిక విభేదాలతో సహా అనేక రకాలైన ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి ఈ అభ్యాసం చాలా దోహదపడుతుంది. అందుకే దీని విశిష్టతను గమనించి ఐక్యరాజ్యసమితి ఈ రోజును గుర్తించింది.

==========================

దేశంలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక వైభవంగా మహా కుంభమేళా మరి కొద్ది రోజులలో ప్రారంభం కానుంది. 2025 జనవరిలో మహా కుంభమేళాని అతి వైభవంగా జరిపేందుకు కేంద్ర ప్రభుత్వంతో పాటు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నాయి. కుంభమేళా ప్రయాగ్‌రాజ్‌లోని సంగం, హరిద్వార్‌లోని గంగా, ఉజ్జయినిలోని షిప్రా నదిలో, నాసిక్‌లోని గోదావరి నది వద్ద నిర్వహించనున్నారు. ఈ మహా కుంభమేళా 2025లో జనవరి 13వ తేదీన ప్రారంభమై, ఫిబ్రవరి 26వ తేదీ వరకు జరుగుతుంది. సుమారు ఒక నెల 13 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొంటారు.

==========================

ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకం కింద విద్యుత్ తక్కువ ధరకు లభిస్తుందని కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి చెప్పారు. కోల్ కతాలో ఈ రోజు పశ్చిమబెంగాల్, బీహార్, ఒడిశా, జార్ఖండ్, ఈశాన్య రాష్ట్రాల ప్రతినిధులతో సమావేశమై ఈ పథకం అమలు తీరును ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ పథకం ద్వారా దేశంలో ఇప్పటిదాకా ఆరు లక్షల 30 వేల స్థాపనలు జరిగాయని వివరించారు. అయితే పశ్చిమబెంగాల్ సహా కొన్ని రాష్ట్రాలు ఈ పథకం అమలులో వెనుకబడి ఉన్నాయని మంత్రి తెలిపారు. సూర్య ఘర్ యోజన ఒక ముఖ్యమైన ప్రభుత్వ పథకం అని ఆయన గుర్తు చేశారు.

==========================

ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన ద్వారా దేశంలో ఇప్పటిదాకా 54 కోట్లకు పైగా జీరో బ్యాలెన్స్ బ్యాంకు ఖాతాలు తెరిచామని కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా తెలిపారు. న్యూఢిల్లీలో ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, గతంలో బ్యాంకింగ్ రంగానికి అందుబాటులో లేని వారు కూడా ఈ పథకం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు

ఎంతగానో దోహదపడుతున్నారని అన్నారు. జన్ ధన్ బ్యాంకు ఖాతాలలో 55 శాతం మహిళలవే ఉన్నాయని తెలిపారు. అదే విధంగా, ఈ పథకం లబ్ధిదారులలో 66 శాతం మంది గ్రామీణ, చిన్న పట్టణాలకు చెందిన వారేనని పేర్కొన్నారు.

============================

డిజిటల్ చెల్లింపులలో ప్రపంచంలోనే భారత యూపీఐ చెల్లింపు వ్యవస్థ ముందంజలో ఉందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాప్ రావు జాదవ్ అన్నారు.

============================

============================